ప్రజాశక్తి
గురువారం 23 ఫిబ్రవరి 2023 5 కర్నూలు



పంట లేక..పని కోసం...

- వలస వెళ్తున్న వారిలో సగం మంది రైతులే - దిగుబడి సరిగ్గా రాకపోవడమే కారణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

భూమినే నమ్ముకుని బతికే రైతన్న ఆ భూములను వదిలి బతుకుదెరువు కోసం పట్టణాలకు, నగరాలకు వలస బాట పడుతున్నారు. జిల్లా నుంచి వలస వెళ్తున్న వారిలో సగం మంది రైతులే ఉన్నారు. దిగుబడి సరిగ్గా రాకపోవడంతో పశ్చిమ ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులు వలసబాట పట్టారు...



ఎమ్మిగనూరు మండలం దైవందిన్నెలో ఎండిపోయిన పత్తి పంట (ఫైల్)

వలసల నివారణకు పాలకులు, అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో కర్నూలు జిల్లాలో దశాబ్దాలుగా వలసలు ఆగడం లేదు. ప్రతి ఏడాదీ వర్షాలు సరిగ్గా పడక పంటలు పండకపోవడం వల్ల వ్యవసాయ కూలీలకు పనుల్లేక కర్నూలు జిల్లా నుంచి వలసలు పెద్ద ఎత్తున కనిపించేవి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల, పత్తి పంటను గులాబీ పురుగు ఆశించడం వల్ల కర్నూలు జిల్లాలోని ఆదోని డివిజన్ పరిధిలో వ్యవసాయ కూలీలు, చిన్నకారు, కౌలు రైతులు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన వర్షానికి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. దాంతో చిన్న రైతులు నష్టాల పాలయ్యారు. కౌలు రైతులకు కనీసం కౌలు కూడా గిట్టలేదు. వ్యవసాయ కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో కర్నూలు జిల్లాలో వలసలు పెద్ద ఎత్తున మొదలయ్యాయి. ఇప్పటి వరకూ 40 వేల మంది వరకు బతుకు కోసం వలస బాట పట్టారు. వారిలో సగం మంది చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలే ఉన్నారు. కోసిగి, ఎమ్మిగనూరు, నందవరం, హోళగుంద, పెద్దకడబూరు మండలాల నుంచి పట్నాలకు తరలి వెళ్లారు. ఎమ్మిగనూరు మండలం నుంచి ఇప్పటి వరకూ దాదాపు 10 వేల మంది వలస వెళ్లగా 5వేల మంది వరకూ రైతులు ఉన్నారు. కె.తిమ్మాపురం నుంచి వలస వెళ్లిన వెయ్యి మందిలో 400 మంది, కలగట్ల నుంచి వలస వెళ్లిన 700 మందిలో 350 మంది రైతులు ఉన్నారు. కడివెళ్ల, సొగనూరు, పార్లపల్లి, పెసలదిన్నె గ్రామాలకు సాగునీరు లేకపోవడం వర్షాధారంతోనే పంటలు పండిచాల్సి రావడంతో పంటలు సరిగ్గా పండలేదు. హోళగుంద మండలంలో ఇప్పటికే 2 వేల మందికి పైగా పట్టణాల బాట పట్టారు. వారిలో దాదాపు 700 మంది వరకూ సన్న, చిన్నకారు రైతులు ఉన్నారు. అందరూ ఒకటి, రెండు ఎకరాలు ఉన్న వారే. ఆ మండలంలోని 23 గ్రామాల్లోనూ వలసదారులు ఉన్నారు. కోసిగి మండలం నుంచి ఇప్పటికే 15 వేల మంది వలస వెళ్లగా వారిలో 8వేల మందికి పైగా రైతులే ఉన్నారు. ఈ ఏడాది వ్యవసాయ పనులు సక్రమంగా లేకపోవడంతో గతేడాది కన్నా ఎక్కువ మంది వలస వెళ్లారు.

పెట్టుబడి రూ.1.50 లక్షలు..దిగుబడి రూ.15 వేలు

- గరిక వీరేష్, దుద్ది, కోసిగి మండలం



నేను నాలుగున్నర ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశాను. మొత్తంగా రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టాను. పత్తి పంటకు గులాబీ పురుగు ఆశించడంతో రెండు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. దాని వల్ల రూ.15వేలు వచ్చింది. వేరు గత్యంతరం లేక రంగారెడ్డి జిల్లాలో పత్తి విడిపించేందుకు కుటుంబంతో బతుకు కోసం వలస బాట పట్టారు.

వర్షం పడదు..కాలువ లేదు..

- గొల్ల నాగేంద్ర, కడివెళ్ల, ఎమ్మిగనూరు మండలం.



మాకు ప్రభుత్వం ఇచ్చిన 1.5 ఎకరాల సీలింగ్ ల్యాండ్ ఉంది. పంట సాగు చేద్దామని అనుకుంటే వర్షాలు పడవు. మా గ్రామానికి పంటకు నీరు పెట్టుకునేందుకు కాలువ కూడా లేదు. దీంతో కుటుంబంలోని 13 మందీ వలస పోతాం. గుంటూరుకు పోయి మిర్చి పని చేస్తున్నాం. రోజుకు రూ.400 లెక్కన కూలీ ఇస్తారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.



ఖరీఫ్‌లో పంటలు ఏ మాత్రం రాలేదు. రబీలోనైనా పంటలు వస్తాయని ఆశించినా రాలేదు. వచ్చిన అరకొర పంటలకు ధర రావడం లేదు. దీంతో రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారు. అందుకే వలస వెళ్లే పరిస్థితి వచ్చింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టడం లేదు. గుండ్రేవుల, మేళిగనూరు, ఆర్‌డిఎస్ వంటి పెండింగ్ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి. అప్పుడే రైతులకు, వ్యవసాయ కూలీలకు పని దొరుకుతుంది. తక్షణం వలసలు నివారించేందుకు 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.



ఆవాజ్ మహాసభలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఏ.గఫూర్

లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు కృషి

- బిజెపికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం - ఆవాజ్ వ్యవస్థాపకులు ఎంఏ.గఫూర్

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

భారతదేశంలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని , అందుకు ఆవాజ్ పని చేయాలని ఆవాజ్ వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ పిలుపునిచ్చారు. బుధవారం కర్నూలు చౌక్ వద్ద గల జిబి ఫంక్షన్ హాల్లో ఆవాజ్ నగర రెండవ మహాసభ నగర కార్యదర్శి పి ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. ఎంఏ. గఫూర్ మాట్లాడుతూ భారతదేశం ఒక లౌకిక రాజ్యమని, అన్ని మతాలు, కులాలకు చెందిన వారు జీవిస్తున్నారని, అందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించే విధంగా రాజ్యాంగం రూపొందించిందన్నారు. పార్లమెంటులో బిజెపికి సంపూర్ణ మెజార్టీ ఉండడంతో మోడీ, అమిత్ షాలు దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను అమలు చేస్తూ కాషాయీకరణ చేయాలని చూస్తుందని పేర్కొన్నారు. వారు ప్రధానంగా ముస్లింలకు భారతదేశంలో పౌర హక్కులు లేకుండా హిజాబు, హలాల్, త్రిబుల్ తలాక్ లాంటివి అడ్డుపెట్టి ముస్లింలను భారతదేశం నుండి తరిమి వేయాలని చూస్తున్నారన్నారు. దేశంలో ముస్లింలు రెండవ తరగతి ప్రజలుగా ఉండాలని చూస్తున్నారన్నారు. ముస్లింలను, క్రైస్తవులను నాశనం చేయాలని హింసకు పాల్పడుతున్నారని చెప్పారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని జగన్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా క్రైస్తవులను, ఆవాజ్‌తో కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి బడ్జెట్లు కేటాయించకుండా, సబ్సిడీ రుణాలు ఇవ్వకుండా చేస్తుందన్నారు. ముస్లింలు విద్యాపరంగా వెనుకబడి ఉన్నారని, వారు తమ హక్కులను కూడా అనుభవించలేదని పరిస్థితి ఏర్పడిందన్నారు. హరామ్ అనే నినాదంతో ఆవాజ్ ను ముందుకు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఉస్మానియా కళాశాల అర్థశాస్త్ర మాజీ ప్రొఫెసర్ మన్సూర్ రెహమాన్, కర్నూల్ చరిత్ర గురించి కర్నూలు చరిత్రను గురించి విపులంగా వివరించారు. స్వాతంత్ర సమరంలో ముస్లింల పోరాటాలను , వారి త్యాగాలను గురించి తెలిపారు. ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఏ.సుభాన్ మాట్లాడుతూ సెక్యులరిజం కోసం ఆవాజ్ 2002లో ప్రారంభించి ముస్లింల సమస్యలు, పేదల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. ప్రభుత్వాల్లో ఉన్నటువంటి నాయకులు ముస్లింలను గురించి మాట్లాడడం లేదన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భారత ఆగ్రో ఏజెన్సీ ప్రొప్రైటర్ వాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ గతంలో కర్నూల్ నగరంలో నీటి దాతల సహకారంతో తాగునీరు అందించేవారని, ఆవాజ్ ద్వారానే సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి కర్నూలు నగరానికి నీటి సమస్య లేకుండా చేశారని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ హక్కులను సాధించుకోవాలంటే తమ పిల్లలను చదివించుకోవాలని సూచించారు. ఆవాజ్ నగర అధ్యక్షులు ఆవాజ్ కమిటీగా కర్నూల్ నగరంలో చేసినటువంటి సంక్షేమ కార్యక్రమాలను, కరోనా సమయంలో చేసిన సేవలను గురించి వివరించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.

కర్నూల్ నగర నూతన ఆవాజ్ కమిటీ

గౌరవ అధ్యక్షులుగా బాబు (ఇస్మాయిల్), అధ్యక్షులుగా పి.ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శిగా ఎస్ఎండి.షరీఫ్, కోశాధికారిగా ఇలియాస్, ఉపాధ్యక్షులుగా నయీమ్, చోటు భాయ్, అబ్దుల్ రహిమాన్, ఫయాజుల్ కరీం, సహాయ కార్యదర్శులుగా ఇంతియాజ్, నాసిర్ అహ్మద్, బషీర్ అహ్మద్, ఇర్ఫాన్, శాలిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా గని ఖాన్, గౌస్, అల్లబకాష్, అబ్రార్, షేక్ బాషా, ఇమ్రాన్, మహబూబ్ బాష, మాలిక్, హనీఫ్, చాంద్, మగ్బుల్, అబ్దుల్ రెహ్మాన్, అహమద్, ఖాదర్ - ఖండెరి, అబ్దుల్లా , షాషా వలి, చాంద్‌ను ఎన్నుకున్నారు.

అట్టహాసంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

- భారీగా తరలొచ్చిన మద్దతుదారులు
- గుత్తి రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపుదాం
- ముఖ్యమంత్రి మాట తప్పాడు...మడమ తిప్పాడు...
- ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, సాబ్జి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) ఎమ్మెల్సీ అభ్యర్థులు కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులు బుధవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, సాబ్జి, మాజీ ఎమ్మెల్సీలు డాక్టర్ గేయానంద్, జల్లివిల్సన్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితోపాటు అనంతపురం, కడప, కర్నూలు ఉమ్మడి జిల్లాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. గుత్తిరోడ్డులోని చలమారెడ్డి ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించారు. డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మట్లాడారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను చట్టసభలకు పంపించాలన్నారు. మాట తప్పను.. మడమ తిప్పను .. అన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఉద్యోగులు, కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్కమాటను నిలుపుకోలేదని చెప్పారు. ఆయన మాటా తప్పాడు...మడమా తిప్పాడూ అని ఎద్దేవా చేశారు. చట్ట సభల్లో ప్రజా సమస్యలపై ఇప్పుడు చర్చ జరగడం లేదని విచారం వ్యక్తం చేశారు. అవి బూతుల సభలాగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పీడీఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని గుర్తు చేశారు. ఈ బలాన్ని మరింత పెంచే విధంగా ఇక్కడికొచ్చిన ప్రజాసంఘాలన్నీ కలిసి పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించి మండలికి పంపాలని పిలుపునిచ్చారు. ప్రశ్నించే గొంతుకలను మండలికి పంపడం ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించగలమని తెలిపారు. ఎమ్మెల్సీ సాబ్జి మాట్లాడుతూ... మండలి ఎన్నికలు కౌరవులు, పాండవులకు మధ్య జరుగుతున్న పోరు అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిలదీసే పిడిఎఫ్ అభ్యర్థులను ఓడించేందుకు అధికార పార్టీ సాయశక్తులను ఒడ్డుతోందని చెప్పారు. దీన్ని ప్రజా సంఘాల ఐక్య బలంతో తిప్పికొట్టి పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ పట్టభద్రుల అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ... ఇన్ని ప్రజాసంఘాలు వచ్చి తమ అభ్యర్థిత్వాన్ని బలపరచడంతోనే తమకు నైతిక విజయం లభించినట్టయిందన్నారు. అధికార వైసిపి ఈ ఎన్నికల్లో ఏదో రకంగా గెలుపొందేందుకు సర్వశక్తులు ఒడ్డుతోందన్నారు. కొంత మంది అధికారులను ఇక్కడికి పంపి ప్రలోభ పెట్టే ప్రయత్నాలు ఇప్పటికే చేస్తోందన్నారు. దీన్ని ప్రజా సంఘాల నాయకులు తిప్పికొట్టడం జరిగిందని గుర్తు చేశారు. ఎన్నికలకు సమయం తక్కువగానున్న తరుణంలో మరింత అప్రమత్తతో వ్యవహరించాల్సిన అవసరముందన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ... ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని తెలిపారు. ఈ సమస్యలపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఎప్పటికప్పుడు మండలిలో పోరాటం సాగించామని గుర్తుచేశారు. సిపిఎస్‌పైనా, పిఆర్‌సిపైనా మండలిలో గొంతెత్తామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ ఈ సమస్యలపై పోరాటాన్ని సాగిస్తామని చెప్పారు. సిఐటియు, ఎఐటియుసి, యుటిఎఫ్, ఎస్టీయు, ఐద్వా, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎఐవైఎఫ్, బీసీ,ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న నిర్వహిస్తున్న నాయకులు



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రం అందజేస్తున్న నారాయణరెడ్డి

టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నారాయణరెడ్డి నామినేషన్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : రాయలసీమ పశ్చిమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో జీవి నారాయణరెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు వేశారు. అనంతపురం కలెక్టరేట్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఆయన తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. మండలి ఎన్నికల్లో అధికార పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతుందన్నారు. ఉపాధ్యాయులు అధ్యాపకులు , ప్రైవేటు టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అన్ని విధాలుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు జి. ఓంకార్ యాదవ్, డిటిఎఫ్ రాష్ట్ర నాయకులు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిసి రోడ్లపై ఇఒఆర్‌డి అవగాహన

ప్రజాశక్తి-సి బెళగల్

సిసి రోడ్లపై రాళ్లు, రప్పలు, కట్టెలు వంటివి తీసివేసుకోవాలని ఇఒఆర్‌డి సందీప్ ప్రజలకు సూచించారు. బుధవారం పోలకల్ గ్రామం వీధుల్లో తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. సిసి రోడ్లు ముందుగానే చిన్నవిగా ఉంటాయని, అందులో రాళ్లు,రప్పలు, కట్టెలు వంటివి అక్రమంగా వేసుకోవడం వలన రాకపోకలకు ఇబ్బందిగా మారీ రోడ్లు కళావిహీనంగా మారుతాయని ఇలాంటివి మానుకోవాలని తెలిపి, లేదంటే తగు చర్యలు చేపడతామని హెచ్చరించారు.

నగరంలో మైనర్ డ్రైవింగ్ లపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ : కర్నూలు పట్టణ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కర్నూలు జిల్లా ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పి నాగభూషణం ట్రాఫిక్ పోలీసులు మైనర్ డ్రైవింగ్ లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ , సెంటర్లో మోటారు వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ , డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న 22 మంది మైనర్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల కేసులు నమోదు చేసి రూ.33,770 జరిమానా విధించామన్నారు. మైనర్ డ్రైవింగ్ చేసిన వాహనదారులకు కర్నూలు నగరంలోని కొత్తపేట దగ్గర ఉన్న కర్నూలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, త్రిబుల్ రైడింగ్ వెళ్లకూడదని, సెల్ఫోన్ డ్రైవింగ్ చేయకూడదని, రాంగ్ రూట్ వెళ్లకూడదని, హెల్మెట్ ధరించాలని, రోడ్డు ప్రమాదాల వలన నష్టాల గురించి కర్నూలు ట్రాఫిక్ డిఎస్‌పి వివరించారు. మైనర్ డ్రైవింగ్ చేసిన వాహన చోదకుల తల్లిదండ్రులను పిలిపించి వారికి పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని చెప్పారు. మైనర్లచే ఇంకెప్పుడు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించబోమని ప్రతిజ్ఞ చేయించారు.

తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తొలి స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు పేర్కొన్నారు.బుధవారం స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతిని పురస్కరించుకొని ఎ.క్యాంప్ లోని ఆయన కాంస్య విగ్రహానికి జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్ తేజ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ ..1857 నాటి మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధానికి పదేళ్ళ ముందే, బ్రిటిషు పాలకులను ఎదిరించి తిరుగుబాటు చేసిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని కొనియాడారు. వారి జ్ఞాపకంగా 2021వ సం. మార్చి 25 తేదిన ఓర్వకల్లు దగ్గర ఉన్న కర్నూలు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విమానాశ్రయం పేరు పెట్టామన్నారు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అధికారులు ప్రవేశపెట్టిన మార్పులకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి వారిపై పోరాడిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని, ఆయన పోరాటం పలువురికి స్ఫూర్తిగా నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్, కమిషనర్

ఆర్‌టిసికి రూ.2.80 కోట్లు ఆదాయం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రయాణీకుల సౌకర్యార్థం కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని నుండి శ్రీశైల క్షేత్రానికి, అలాగే కర్నూలు నుండి వెంకటాపురానికి, జగన్నాథగట్టుకు, అలాగే గురుజాల క్షేత్రానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా రవాణా సంస్థ, కర్నూలు జిల్లాలో ఈనెల 12నుంచి 20 వరకు షెడ్యూలు బస్సులకు అదనంగా ప్రత్యేక బస్సులు నడిపామన్నారు. మొత్తంగా 294 బస్సులతో, 4.84 లక్షల కిలోమీటర్లు నడిపి, రూ.2.80 కోట్ల ఆదాయాన్ని అర్జించామని ఆర్ఎం టేకి వెంకటరామం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీజిల్ రేట్లు విపరీతంగా పెరిగినప్పటికీ, బస్సు చార్జీలు పెంచకుండా, గత సంవత్సరం రేట్లనే కొనసాగించామన్నారు. సంస్థ బస్సులలో అభిమానంతో ప్రయాణించి, ఆదరించిన ప్రయాణిక దేవుళ్ళకు, అదేవిధంగా సహకరించిన కార్మిక సోదరులకు, అసోషియేషన్ సభ్యులకు, సూపర్ వైజర్లకు, సహచర అధికారులకు , పత్రిక ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించండి

ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. ఓర్వకల్లు మండల కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాలయంలో ప్రజా సంఘాల సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ రైతు సంఘం వ్యవసాయ కార్మిక సంఘం సిఐటియు కెవిపిఎస్ సంఘాల నాయకులు చంద్రబాబు నాయుడు, మధుసూదన్, సుధాకర్ మల్లేష్ రామాంజనేయులు, శేషయ్య లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ వామపక్ష ప్రజా సంఘాలు, బిసి సంఘాలు బలపర్చిన పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పదేళ్లుగా టీచర్ ఉద్యోగాన్ని వదిలేసి నిరంతరం నిరుద్యోగుల సమస్యలు ప్రజా సమస్యలు ఉద్యోగుల హక్కుల కోసం పోరాడుతున్నారని, అలాంటి పోతుల నాగరాజును చదువుకున్న మేధావులు ఉద్యోగులు, టీచర్స్ ఆలోచించాలని అన్నారు. ఇప్పటికే పిడిఎఫ్ తరపున గెలిచిన ఎమ్మెల్సీలు నిరంతరం పోరాడుతున్నారని అన్నారు. వారితో పాటుగా పోతుల నాగరాజు లాంటి వ్యక్తులను విధాన సభకు పంపిస్తే మరింత పోరాడి నిరుద్యోగులు ఉద్యోగులు ప్రజా సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్సీలు ఏ ఒక్కరోజు టీచర్స్ ప్రజా సమస్యల పైన మాట్లాడిన దాఖలాలు లేవని, అలాంటి వారు డబ్బు వెదజల్లి ఓట్లర్లను ప్రభావితంచేసి గెలిచిన వ్యక్తులు తమ సంపాదన పెంచుకోవడానికి ప్రయత్నం చేస్తారు తప్ప ప్రజాసేవ చేయరని అన్నారు. దయచేసి మేధావులు చదువుకున్న వారు ఆలోచించి పోరాడే వ్యక్తులకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివారెడ్డి, శేఖర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆయన వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. పలువురు కార్పొరేటర్లు పర్వీన్, హకీమ్ వైసిపి నాయకులు ఖాదర్బాషా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మద్దయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల మండలిలో1178 ఓటర్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల శాసనమండలి తుది ఓటర్ల జాబితాలో మొత్తం1178 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి జాయింట్ కలెక్టర్ రామ సుందర్ రెడ్డి వెల్లడించారు. ఈ జాబితాలో పురుష ఓటర్లు 512 మంది స్త్రీల ఓటర్లు 666 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. తుది ఓటర్ల జాబితాను మున్సిపాలిటీ , మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రచురించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

సామాజికి న్యాయం చేస్తున్న సిఎం : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి- వెల్దుర్తి

దేశంలో ఎక్కడా లేనివిధంగా బిసిలకు పెద్దపీట వేస్తూ, ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో అన్ని కులాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. బుధవారం వెల్దుర్తి అమెజాన్ హోటల్‌లో మండల వైసిపి నాయకుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర క్యాబినెట్‌లో 25 మంది మంత్రులలో ఏకంగా 11 మంది బీసీలకు మంత్రులు పదవులు యిచ్చారని, 18 మంది ఎమ్మెల్సీలలో ఏకంగా 11 మంది బిసిలకు అవకాశం ఇచ్చారన్నారు. అనంతరం పట్టణంలో ఉన్న జ్యోతిబాపూలే, విద్యానికేతన్ కళాశాలలో ప్రచారం నిర్వహించారు. వైసిపి మండల కన్వీనర్ రవిరెడ్డి , మండల గృహసారధుల సచివాలయ కన్వీనర్ సమీర్ రెడ్డి, జడ్పిటిసి సుంకన్న, సర్పంచి శైలజ పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ బుధవారం పరిశీలించారు. మార్చి 13న పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న సందర్భంగా అందుకు అవసరమైన పోలింగ్ కేంద్రాలను గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటర్ల కోసం పదో తరగతి 'ఎ' సెక్షన్, 'బి' సెక్షన్‌లో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒక్కో కేంద్రంలో 755 మంది చొప్పున మొత్తం 1510 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 45 మంది ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఓటర్ల కోసం పదో తరగతి 'సి' సెక్షన్‌లో ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అయిన ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తహశీల్దార్ వేణుగోపాల్‌తో కలిసి పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, వాటిలోని సౌకర్యాలను పరిశీలించి ఆమోదించారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న సబ్ కలెక్టర్

'పది'లో మంచి ఉత్తీర్ణత సాధించాలి

- ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు

ప్రజాశక్తి-ఆలూరు

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉతీర్ణత సాధించాలని ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు వీరేష్, ఎస్.కె.గిరి, కమ్మర చేడు వీరేష్, మైనా తెలిపారు. బుధవారం ఆలూరులోని మోడల్ స్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'ప్రజ్ఞా వికాసం' పదో తరగతి మోడల్ పరీక్ష పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆలూరు మండల వ్యాప్తంగా 386 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. పబ్లిక్ పరీక్షలపై అవగాహన, పరీక్షల పట్ల భయాందోళన చెందకుండా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా పరీక్షలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని పబ్లిక్ పరీక్ష పట్ల శ్రద్ధ వహించి మంచి ఉతీర్ణత సాధించాలని తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ వీరేష్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, కార్యదర్శి పోతురాజు, డివైఎఫ్ఐ నాయకులు గోవర్ధన్, దీపక్, అడ్వకేట్ నబి, వార్డు మెంబర్ రాజశేఖర్, గిరిమూర్తి, విరుపాక్షి పాల్గొన్నారు.



ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు

సీనియర్ జర్నలిస్టుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

తెలుగు దిన పత్రికా రంగంలో 38 ఏళ్లుగా జర్నలిస్టుగా కొనసాగుతున్న విజేంద్ర నాథ్ ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. బుధవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వ్యాపారవేత్త వినోద్ రెడ్డి, బీసీ నాయకులు కన్నె జగదీశ్, ఎమ్.డి.బద్రినాథ్ స్వామి, పూజారి శాంతప్ప, ముజీబ్ అహ్మద్‌లు శాలువాలతో సన్మానించారు. పత్రికా ప్రపంచంలో తెలుగు భాషకు అత్యంత ప్రాచుర్యం కల్పిస్తున్న జర్నలిస్టులందరికీ అభినందించామని వారు చెప్పారు. సమాజాన్ని మేల్కొలిపే జర్నలిజాన్ని, అందులో విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులను ఆదరించాల్సిన అవసరం ఉందన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడాలన్నారు.



సీనియర్ జర్నలిస్టును సన్మానిస్తున్న వ్యాపారవేత్త

స్వర్ణమయమైన రాఘవేంద్రుని బృందావనం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుని మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం స్థానిక శ్రీమఠంలో రాఘవేంద్రుని గురు వైభవోత్సవాల్లో భాగంగా పూజారులు రాఘవేంద్రుని మూల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరిచారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రుని ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకున్నారు.



సమగ్ర సర్వేతోనైనా...

ప్రభుత్వ భూమి లెక్కలు తేలేనా..?

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో స్థలాల అన్యాక్రాంతం సమస్య వేధిస్తోంది. ప్రభుత్వ స్థలాలు, మున్సిపాలిటీ స్థలాలు, పొరంబోకు స్థలాలు ఇప్పటికే కబ్జాకు గురయ్యాయని పలు ఆరోపణలు ఉన్నాయి. బ్రిటీష్ కాలం నాటి భూ రికార్డులను కొందరు అధికారులు తమకు అనుకూలంగా మార్చుకొని భారీ ఎత్తున ముడుపులు తీసుకొని అనుకున్న వారికి స్థలాలు అప్పగించినట్లు కూడా ఫిర్యాదులు ఉన్నాయి. సమగ్ర భూ సర్వేతోనైనా సమస్యలు పరిష్కారమై బాధితులకు న్యాయం జరుగుతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి...

ఆదోని మున్సిపాలిటీ స్వరూపం

కల్లుబావి, పర్వతాపురం, మండగిరి, వెంగలాపురం, ఆదోని ప్రాంతాలను కలుపుకొని ఆదోని మున్సిపాలిటీగా అప్పట్లో ఏర్పాటు చేశారు. పట్టణ జనాభా పెరిగి స్థలాలు సరిపోని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే రోజురోజుకు అన్యాక్రాంతాలు పెరిగి రోడ్లు ఇరుకుగా మారాయి. ప్రభుత్వ స్థలాలను యథేచ్ఛగా కబ్జా చేసి కట్టడాలు కూడా నిర్మించుకున్నారు. అలాంటి సమస్యలు సమగ్ర సర్వేతో బయటపడి కట్టడికి సాధ్యమవుతుందని అంటున్నారు మున్సిపల్ అధికారులు. ఆదోని పట్టణం విస్తీర్ణం 37.012 చదరపు కిలోమీటర్లు ఉంది. డాక్యుమెంట్ ప్రకారం ప్రతి ఇంటినీ కొలిచి సంబంధిత వ్యక్తికి సర్వే నెంబర్‌తో పాటు హక్కు పత్రం జారీ చేస్తామని పేర్కొంటున్నారు. సర్వే వివరాలను ఆన్‌లైన్‌తోపాటు రికార్డుల్లో పొందపరిచి భద్రపరుస్తామని చెబుతున్నారు. ఆదోని పట్టణంలో శివారు ప్రాంతాల వరకు సుమారు 35 వేల గృహాలు ఉన్నాయి. వాటన్నింటినీ త్వరలోనే సర్వే చేసి హక్కు పత్రం ఇస్తామని, ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయినట్లు మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు.



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ (ఫైల్)

త్వరలోనే సమగ్ర సర్వే

- శ్రీనివాసులు, టిపిఒ, ఆదోని.



ఆదోని పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే ప్లానింగ్ సెక్రటరీల ద్వారా వార్డుల వారీగా మ్యాపింగ్ పూర్తయింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఇంటింటికీ తిరిగి సర్వే పనులు మొదలు పెడతాం. అందుకు కావాల్సిన సామగ్రి, మెటీరియల్ కోసం ప్రభుత్వానికి నివేదించాం. ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న తరహాలోనే మున్సిపాలిటీలో కూడా సమగ్ర సర్వే మొదలవుతుంది. మున్సిపాలిటీ స్థలాలు, ప్రభుత్వ స్థలాలు, పొరంబోకు స్థలం వివరాలను బహిర్గతం చేస్తాం.



పౌరసరఫరాల కార్పొరేషన్ ద్వారా జొన్నలు కొనుగోలు

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని డివిజన్‌లోని రైతుల దగ్గర నుంచి జొన్నలు కొనుగోలు చేయడానికి పౌర సరఫరాల కార్పొరేషన్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఆదోనిలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడారు. క్వింటా మార్కెట్ ధర రూ.2,700 ఉండగా పౌరసరఫరాల కార్పొరేషన్ వారు రూ.2,970 వరకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జొన్నలను అమ్మిన రైతులకు అక్కడే నగదు ఇస్తారని చెప్పారు. వివరాలకు ఆయా గ్రామాల విఆర్ఒలను సంప్రదించాలని కోరారు. తక్కువ ధరకు విక్రయించుకొని నష్టపోకుండా ఉండేందుకే ఈ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. **ఎమ్మిగనూరు** తహశీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ మాట్లాడారు. తహశీల్దార్ జయన్న పాల్గొన్నారు.

వైభవంగా సుంకులమ్మ దేవర ఉత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని మాదాపురం గ్రామంలో బుధవారం సుంకలమ్మ దేవర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ, దేవరగట్టు ఆలయ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా పాల్గొని వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. టిడిపి, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

- రూ.60 వేల నష్టం



ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని పోలకల్ గ్రామంలో చిన్న రామయ్యకు చెందిన గడ్డివామి బుధవారం అగ్నికి ఆహుతయింది. మూగ జీవాల కోసం రూ.60 వేల విలువైన గడ్డివామిని చిన్న రామయ్య సిద్ధం చేసుకున్నారు. ఈ తరుణంలో గుర్తుతెలియని వ్యక్తులు బీడి తాగి పడేసి వెళ్లినట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేశారు. పూర్తిగా కాలిపోవడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

నామినేషన్‌కు తరలి వెళ్లిన నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు తరలివెళ్లారు. ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, కార్మిక, ప్రజాసంఘాలు బలపరుస్తున్న ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థులైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజుకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ సిఐటియు, వ్యకాస, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, జిఎంపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మిగనూరు నుంచి అనంతపురం జిల్లాకు బయల్దేరి వెళ్లారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, రాముడు, ఎపి రైతు సంఘం జిల్లా నాయకులు హనుమంతు, సిఐటియు మండల కార్యదర్శి రాముడు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప పాల్గొన్నారు. **ఆదోని** నుంచి డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ప్రజాసంఘాల నాయకులు లక్ష్మణ్, గోపాల్, తిప్పన, వీరేష్, వెంకటేష్, నాగరాజు, శ్రీనివాసులు తరలి వెళ్లారు.



ఎమ్మిగనూరు నుంచి తరలి వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులు



ఆదోని నుంచి తరలి వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులు

మెస్ చార్జీలు నామమాత్రంగా పెంచడం సరికాదు

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని



నామమాత్రంగా పెంచిన మెస్ ఛార్జీలను నెలకు రూ.2500లకు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో 3, 4వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు రూ.1150, 5 నుంచి 10వ తరగతులకు రూ.1400లు, ఇంటర్ ఆపై చదువుతున్న విద్యార్థులకు రూ.1600లకు పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచి ఐదేళ్లు అవుతోందని చెప్పారు. కరోనా తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మెస్ చార్జీలను నామమాత్రంగా పెంచిందన్నారు. దానికి తోడు ఇచ్చిన నూతన మెనుకు, పెంచిన చార్జీలు ఏ మాత్రం సరిపోవని తెలిపారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సంక్షేమ హాస్టల్‌లో పౌష్టికాహారం అందాలంటే నెలకు రూ.2500 అందించాలని కోరారు. ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, గత రెండేళ్ల నుంచి కాస్మోటిక్ చార్జీలు ఇవ్వడం లేదని, వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గొప్ప దార్శనికుడు ఆజాద్...

- టిడిపి నాయకులు
- ఘనంగా ఆజాద్ వర్ధంతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నమ్మిన సిద్ధాంతాల కోసం కృషి చేసి, జాతీయోద్యమంలో కీలకపాత్ర పోషించి, దేశం కోసం జైలు జీవితం గడిపిన గొప్ప పోరాటయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని టిడిపి నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కోట్ల క్యాంపు కార్యాలయంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ 65వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ బ్రిటీష్ పాలకులకు ఎదురెళ్లి పోరాడిన యోధుడని తెలిపారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్లు జైలు శిక్ష అనుభవించిన గొప్ప దేశభక్తుడని కొనియాడారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న, మాజీ జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ జి.అల్తాఫ్, రాష్ట్ర ఉప్పర (సగర) ఫెడరేషన్ మాజీ డైరెక్టర్ ఉప్పర ఆంజనేయులు, ఎమ్మిగనూరు మండలం మాజీ ఆత్మ ఛైర్మన్ కందనాతి శ్రీనివాసులు, టిడిపి పట్టణ ముస్లిం, మైనార్టీ నాయకులు మదిరే పీర్ బాష, మహబూబ్ బాషా, మేటీ వలీ బాష, ఆఫ్ఘన్ వలీ బాష, టిడిపి మండల నాయకులు కడివెల్ల ఉరుకుంద గౌడ్, సుదర్శన్ గౌడ్, కందనాతి డీలర్ లక్ష్మన్న పాల్గొన్నారు.



కోట్ల క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు



సామాజిక న్యాయానికి మరో పేరు జగన్

- వైసిపి యువనేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజకీయాల్లో అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించి సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని వైసిపి యువనేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ లేని విధంగా శాసనసభలో, శాసన మండలిలో, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, పార్టీ పదవులనే కాదు అన్నింటా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలే కాదు మహిళలకు ప్రాధాన్యం కల్పించిన విషయం అందరికీ తెలిసిందేనని చెప్పారు. ముఖ్యంగా కర్నూలు నగర మేయర్‌గా బివై.రామయ్యకు, మంత్రి వర్గంలో గుమ్మనూరు జయరాంకు, ఆదోని మున్సిపల్ ఛైర్మన్‌గా శాంతకు అవకాశం కల్పించారని తెలిపారు. ఆదోనికి చెందిన డాక్టర్ మధుసూదన్ వైసిపి కోసం ఎంతో కష్టపడ్డారని, ఆయనను ఎమ్మెల్సీ అభ్యర్థి గా ప్రకటించడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు చేయడంలో గత పాలకులు ఏ విధంగా నెరవేర్చారో, ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏ విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారో గమనించి రానున్న కాలంలో కూడా జగన్మోహన్ రెడ్డికి అండగా నిలిచి ఆయన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

వైభవంగా రాఘవేంద్రుని పాదుకా పట్టాభిషేకం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల నేతృత్వంలో రాఘవేంద్రస్వామి పాదుకా పట్టాభిషేక మహోత్సవం వైభవంగా సాగింది. బుధవారం శ్రీగురు రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాల్లో భాగంగా 2వ రోజు శ్రీరాఘవేంద్ర స్వామి వారి పాదుకలను శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు సువర్ణ సింహాసనంలో ఉంచి పండితుల వేద మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ పుష్పార్చన, కనకాభిషేకం, రత్నాభిషేకం (ముత్యాలతో అభిషేకం) నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మాట్లాడారు. శ్రీరాఘవేంద్ర స్వామి వారు నేడు వేదాంత సామ్రాజ్యానికి పట్టాభిషేకం పొంది బాధ్యతలు స్వీకరించిన రోజు అని తెలిపారు. స్వామి వారి పాదుకలకు పట్టాభిషేకం నిర్వహించామని చెప్పారు. సుప్రీంకోర్టు అటార్నీ జనరల్ వెంకటరమణి, పండిత కేసరి రాజా ఎస్.గిరియాచార్యులు అనంతరం స్వామి వారి పాదుకలను సువర్ణ రథంపై ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ భక్త జనుల మధ్య రథోత్సవం నిర్వహించారు. శ్రీమఠం ఎఎఒ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతిఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహమూర్తి పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతులు, భక్తులు

రాజకీయ చరిత్రలో బీసీలకు పెద్దపీట

- వైసిపి జిల్లా అధ్యక్షులు రామయ్య

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాజకీయ చరిత్రలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలకు పెద్దపీట వేశారని వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బివై.రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బీసీలకు రాజకీయ పదవుల కేటాయింపులో తీసుకున్న నిర్ణయం చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖితమవుతుందని తెలిపారు. ఇది ఒక సామాజిక విప్లవమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం బీసీలకు రుణం తీర్చుకోలేనిదని చెప్పారు. 8 రాజ్యసభ సీట్లలో నాలుగు సీట్లు బీసీలకే కేటాయించారని తెలిపారు. 18 మంది ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవుల్లో 14 మంది అభ్యర్థులు బీసీలే ఉన్నారన్నారు. జిల్లాలో తొమ్మిది రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మన్లు, 43 ఉంది స్టేట్ లెవెల్ డైరెక్టర్ల హోదాలు దక్కాయని తెలిపారు. మంత్రి మండలిలో 17 మంది బీసీ మంత్రులు ఉండడం గమనార్హమన్నారు. ఎండోమెంట్ శాఖ కమిటీల్లో నాయీ బ్రాహ్మణులకు సభ్యులుగా స్థానం కల్పించనున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవుల్లో డాక్టర్ మధుసూదన్‌కు చోటుదక్కడం హర్షణీయమని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అణిచివేసిన సంస్కృతి చంద్రబాబు నాయుడుదని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలిచిన సంస్కృతి జగన్మోహన్ రెడ్డిదని తెలిపారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదని, బ్యాక్ బోన్ అని నిరూపించిన వ్యక్తిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. పాణ్యం నియోజకవర్గ పరిధిలో కర్నూలు, ఓర్వకల్లు నీటి సమస్యను తీర్చేందుకు మల్లికార్జున సాగర్ ప్రాజెక్టుకు అడ్మినిస్ట్రేషన్ ఫైనాన్షియల్ అనుమతులు లభించాయని తెలిపారు. కర్నూలు నగరవాసుల దాహార్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నీటి అవసరాలు తీరనున్నాయని చెప్పారు. గురువారం ఉదయం 10.30 గంటలకు స్థానిక వైసిపి జిల్లా కార్యాలయం నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకొని ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్ నామినేషన్‌ను దాఖలు చేస్తారని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను ఎంపిక చేసినందుకు డాక్టర్ మధుసూదన్ ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.మద్దయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవ పూజ ధనుంజయ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు బెల్లం మహేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు ఎర్ర సత్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామయ్య



బాలుర వసతి గృహం

ప్రభుత్వ బాలుర వసతి గృహంలో కనీస సౌకర్యాలు నిల్...

- నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- స్నానం చేయాలన్నా బయటికి పోవాల్సిందే..

ప్రజాశక్తి - తుగ్గలి

తుగ్గలి మండలం పెండేకల్లు ఆర్ఎస్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలుర వసతి గృహంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం తాగడానికి కూడా నీరు దొరకకపోవడంతో దూరం నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ ఉన్న బోరులో సరైన నీరు రాకపోవడంతో విద్యార్థులు బయటి నుంచి నీరు తెచ్చుకొని స్నానం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ఉన్న ప్రభుత్వ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈ వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. ఉన్న ఒక్క బోరులో అరకొరగా నీరు రావడంతో బయటి నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు వాపోతున్నారు. గతంలో ఉన్న ప్రభుత్వ వసతి గృహంలో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఈ వసతి గృహాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తోంది. వేసవి రావడంతో నీటి సమస్య తీవ్ర రూపం దాలుస్తుందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

దళితులపై దాడులను అరికట్టాలి

- మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి-ఆలూరు

కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో దళితులపై అంటరానితనం, దాడులను అరికట్టాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య ఎస్ఐని కోరారు. బుధవారం ఆలూరుకు వచ్చిన మాల మహానాడు నాయకులు కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆలూరు ఎస్ఐ నాయక్‌ను, ఎంపిపి జె.రంగమ్మ, తనయుడు జె.వీరేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నాయకులు మల్లేష్, యూత్ అధ్యక్షులు బలరాం, రాము, శేషప్ప, ఓబులేసు, శేషగిరి, నాగప్ప, రంగయ్య, వెంకటేష్, వెంకటేశులు, హనుమంతు, రామాంజినేయులు, ముని యూత్ అధ్యక్షులు పాండు, నాగప్ప, రాజు, అశోక్, యమున, సంగటి రాజు, సూరి, మంజు, గోవిందు, ఈరన్న, కొండమీద రాజ్, కిరణ్, ముద్దనగేరి శ్రీను, నాగేంద్ర, పాండు, శరత్ పాల్గొన్నారు.



ఎస్ఐని మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

అక్రమ అడ్మిషన్లను అరికట్టాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులో ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లను అరికట్టాలని టిఎన్ఎస్ఎఫ్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తలారి సిద్ధప్ప, మనోహర్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. అకాడమిక్ ఇయర్ ఓపెన్ కాకముందే అడ్మిషన్లు చేస్తూ రూ.వేలకు వేలు వసూలు చేస్తూ విద్యార్థులను, విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యాధికారులను కోరారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యాసంస్థలను నడుపుతున్న కార్పొరేట్ విద్యా సంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిద్ధప్ప

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు వారి తండ్రి జ్ఞాపకార్థం గార్గేయపురం జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. మచిలీపట్నంలో రాష్ట్రస్థాయి అండర్-14 క్రికెట్ క్రీడాకారులకు దుస్తులను అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. మచిలీపట్నంలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో విజేతగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయులు రామచంద్రుడు, ఫిజికల్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సుధాకర్, సుబ్రమణ్యం, శేఖర్‌లు పాల్గొన్నారు.



దుస్తులను పంపిణీ చేస్తున్న వెంకటేశ్వర్లు